క్లుప్తంగా

భోజనం పెట్టాలి



విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాల్లో అమలు అవుతున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్న పథకంలో మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని మండల విద్యాశాఖాధికారి–2 మునిసుబ్రమణ్యం ఆదేశించారు. మంగళవారం ఆయన గాజులపెళ్లూరు గ్రామ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



సమావేశమైన ఉద్యోగ సంఘం నేతలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం భోజన విరామ సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు శాంతి దుర్గ, శ్రీనాథ్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, సమస్యలు, వాటి పరిష్కారం అనే దానిపై చర్చించారు. ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ బకాయిలు, సీపీఎస్ వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ తాలుకా అధ్యక్షుడు దాము, ఏపీ సీబీఎస్ఈఏ తాలుకా అధ్యక్షుడు గంగయ్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్



వినోభానగర్ బస్‌షెల్టర్ చుట్టూ ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

నాగలాపురం: జాతీయ రహదారిపై రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్ షెల్టర్ దుస్థితికి చేరుకుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురతున్నారు. బస్‌షెల్టర్‌లో ప్రయాణికులు కనీసం కూర్చోడానికి వీలు లేని విధంగా మారింది. మండల కేంద్రంలోని వినోభానగర్ గ్రామానికి వెళ్లేదారిలో జాతీయ రహదారి వద్ద ఉన్న బస్‌షెల్టర్ పూర్తిగా మట్టితో పేరుకుపోయి అధ్వాన స్థితిలో ఉంది. చిన్నపాటి వర్షం పడినా ప్రయాణికులు తడుస్తున్నారు. అంతేగాకుండా బస్ షెల్టర్‌కు పక్కనే ఉన్న ప్రైవేటు జూనియర్ కళాశాలకు వెళ్లే విద్యార్థులు రోజూ వందల మంది విద్యార్థులు బస్ కోసం వేచి చూస్తుంటారు. కానీ బస్‌షెల్టర్‌లో చుట్టూ ముళ్లపొదలు పేరుకుపోవడంతో విషపురుగులు ఎక్కడ వస్తాయో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. రహదారులపై బస్ షెల్టర్ నిర్వహణ, సౌకర్యాల కల్పన, శుభ్రత గురించి పట్టించుకోకపోవడంతో బస్ షెల్టర్లు బిచ్చగాళ్లకు ఆవాసాలుగా మారాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు షెల్టర్‌లో కూర్చోవడానికి దిమ్మెలు ఏర్పాటు చేసి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నేడు ప్రదోష పూజలు

నాగలాపురం : మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి లత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఏకాదశి ఉత్సవంలో కల్యాణ వెంకన్న



తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

నారాయణవనం : పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం స్వామివారి మాడవీధి ఉత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. సాయంత్రం తిరుచ్చిపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారిని తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. ఆలయాధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు నరసింహరాఘవ భట్టాచార్య పర్యవేక్షించారు.

మొక్కుబడిగా ర్యాలీ

రేణిగుంట : పట్టణంలో వాట్సాప్ గవర్నెన్స్‌పై సచివాలయ సిబ్బంది మొక్కుబడిగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం నుంచి కూత వేటు దూరంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు సచివాలయ సిబ్బంది ఫొటోలు, వీడియోలు కోసం నడుచుకుంటూ వెళ్లి ఏదో చేస్తామన్నట్లు ముగించారు. ర్యాలీలో పంచాయతీ మండల ఉన్నతాధికారులు పాల్గొనకపోవడం గమనార్హం. కార్యక్రమంలో స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా..

- అనుభూతులు నిండుగా..పట్టాల పండుగ
- డిగ్రీ పట్టాలు కాదు.. ఐసర్ లెగసీ..కూడా
- భావి శాస్త్రవేత్తలుగా సేవ చేయాలని..
- సైన్స్ డిగ్రీ పట్టాలు అందుకున్న విద్యార్థులు

ఏర్పేడు : 'ఏ కొద్ది మందికో వచ్చే అరుదైన అవకాశం ప్రఖ్యాత ఐసర్‌లో విద్యను అభ్యసించే అవకాశం మాకు దక్కింది.. ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుపతి చెంత కొన్నేళ్ల పాటు సాగిన మా విద్యాభ్యాసం ఎన్నో గొప్ప అనుభూతులను మిగిల్చింది. ప్రజ్వలిత భారతావని నిర్మాణానికి భావి శాస్త్రవేత్తలుగా నూతన ఆవిష్కరణలపై దృష్టి సారిస్తామని ఐసర్ పట్టభద్రులు ప్రతిన భూనారు'. ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలో మంగళవారం జరిగిన ఐసర్ 6వ స్నాతకోత్సవంలో సైన్స్ డిగ్రీ పట్టాలను అందుకున్న విద్యార్థుల మనోగతాలను సాక్షితో పంచుకున్నారు.



ఐసర్‌లో పట్టాలు అందుకున్న ఆనందంలో కుటుంబ సభ్యులతో విద్యార్థులు







పట్టాలు అందుకున్న విద్యార్థుల ఆనందోత్సాహాలు.. స్టెప్పులేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు .. వేడుకకు హాజరైన విద్యార్థులు, కుటుంబ సభ్యులు, అధ్యాపకులు

చాలా సంతోషంగా ఉంది



ఐసర్‌లో నేను బీఎస్ఎంఎస్ ప్రోగ్రాం పూర్తి చేశా. 9.7 సీజీపీఏతో గోల్డ్ మెడల్‌ను అందుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది. 2024 గ్లోబల్ ఇమ్యునాలజీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నా. ఓవరీన్ క్యాన్సర్‌పై ఇమ్యునోసప్రజన్‌పై టూల్స్‌ను రూపొందించా. బెంగుళూరులో పీహెచ్‌డీ పూర్తి చేసి, భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్త కావాలని ఆశయంతో ఉన్నా.

– అనిష్ ముఖోపాధ్యాయ్, గోల్డ్ మెడల్ విజేత, ఐసర్, తిరుపతి

బ్యాటరీ రంగంలో ..



మాది అనంతపురం జిల్లా తాడిపత్రి.. నా తండ్రి విశ్వనాథరెడ్డి సామాన్య రైతు. నాలోని ప్రతిభను గుర్తించి నా తల్లిదండ్రులు నన్నెంతో ప్రోత్సహించారు. ఐసర్‌లో చదివే అవకాశం దక్కడం నాకు ఎంతో గర్వకారణం. నేను ఇప్పటికే బ్యాటరీలోని అంశాలపై పలు ప్రయోగ పరిశోధనలు చేశా. బెంగుళూరుతో పీహెచ్‌డీ చేయబోతున్నా. డాక్టరేట్ అందుకున్న తర్వాత బ్యాటరీ రంగంలో స్టార్ట్ అప్ ఏర్పాటు చేసి మరికొంత మందికి ఉపాధి కల్పిస్తాను.

– గిబ్బిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, బీఎస్–ఎంఎస్ పట్టభద్రుడు, ఐసర్, తిరుపతి

సైన్స్ రంగంలో దేశం అగ్రగామి కావాలి



శాస్త్ర, సాంకేతిక రంగాలలో దేశం ఇప్పటికే ఎంతో పురోభివృద్ధిని సాధించింది. సైన్స్ రంగంలో ప్రపంచంలోని అగ్రరాజ్యాలకు దీటుగా భారతదేశం అగ్రగామిగా నిలవాలి. తిరుపతి ఐసర్‌లో బీఎస్–ఎంఎస్ కోర్సును పూర్తి చేయడం సంతోషంగా ఉంది. నూతన ఆవిష్కరణలు చేసేందుకు వీలుగా భావి శాస్త్రవేత్త కావాలన్న ఆశయం ఉంది. అందుకోసం మరింత కృషి చేస్తా.

– ముఫితా మజీద్, పట్టభద్రురాలు, ఐసర్, తిరుపతి

ఎన్నో అనుభూతులను మిగిల్చింది



తిరుపతి ఐసర్‌లో బీఎస్– ఎంఎస్ పూర్తి చేశా. తిరుమల బాలాజీ నెలకొన్న ప్రాంతంలో విద్యను పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషదాయకం. మా తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చే విధంగా భవిష్యత్తులో సైన్స్ రంగంలో శాస్త్రవేత్తగా కావాలని కోరిక బలంగా ఉంది. ఆ దిశగా ముందుకు సాగేందుకు కృషి చేస్తా. ఇక్కడి అనుభూతులు మది నిండుగా పదిలంగా ఉంటాయి.

– ఐశ్వర్య సుకుమారన్, ఐసర్ పట్టభద్రురాలు

తల్లి పాలే బిడ్డకు శ్రేష్టం



కనమనంబేడులో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ దేవకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ: పుట్టిన బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమని, తల్లులు తప్పనిసరిగా బిడ్డలకు పాలు తాగించాలని సీడీపీఓ దేవకుమారి కోరారు. మంగళవారం మండలంలోని కనమనంబేడులో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించారు. తల్లిపాల విశిష్టత, పౌష్టికాహారంపై బాలింతలు, గర్భవతులకు సీడీపీఓ అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రి పాలను తాగించటం వలన బిడ్డకు పోషకాలు పుష్కలంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుదర్శనదేవి, సరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన

శ్రీకాళహస్తి : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు మంగళవారం బ్రెడ్ బిస్కెట్లు, పండ్లు రోటరీ క్లబ్ శ్రీకాళహస్తి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రోటరీ సభ్యులు తల్లి



ఆస్పత్రి వద్ద రోటరీ క్లబ్ సభ్యులు

పాలు ప్రాధాన్యం తెలియజేశారు. తల్లులు తప్పనిసరిగా పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పార్థసారథి, సెక్రటరీ సుధాకర్, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్, సిబ్బంది, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి అన్నారు. మండలంలోని మదనంబేడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాల ఆవశ్యకతపై అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులపై చైతన్యపరచాలని కోరారు. బిడ్డకు పాలు ఇవ్వడంతో తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం వేడుకలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, ఏడబ్ల్యూహెచ్ ఉమ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు హాజరయ్యారు.

'ప్రవచనాలకు పర్మిషన్ లేదా పరమేశా ?'



అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి : పుణ్యక్షేత్రమైన దక్షిణ కైలాస క్షేత్రంలో నిత్యం ఆధ్యాత్మిక ప్రవచనాలతో ధార్మిక ప్రసంగాలతో ముక్తి మార్గాన్ని సూచించాల్సిన చోట ఆధ్యాత్మిక ప్రవచనాలకు శ్రీకాళహస్తి దేవస్థానం అనుమతి ఇవ్వకపోవడం శోచనీయమని దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. నిత్యం భగవద్గీత, రామాయణం, భాగవతం, శివపురాణం వంటి ఇతిహాసాలు శ్రావణం ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం తీసుకొచ్చేందుకు శుక బ్రహ్మ ఆశ్రమం ఆధ్వర్యంలో ఏళ్ల తరబడి ఆధ్యాత్మిక ప్రవచనాలు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం సుఖ బ్రహ్మ ఆశ్రమం ఆధ్వర్యంలో చాతుర్మాస వ్రత ప్రవచనాలకు స్థానిక ముత్యాలమ్మ గుడి కళ్యాణ మండపంలో అనుమతులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. గతంలో వరదరాజుల స్వామి ఆలయ ప్రాంగణంలో గీతా మహయజ్ఞం, ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగేవని దేవస్థానం ఆధ్వర్యంలోనే నిర్వహించే వారిని గుర్తు చేశారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసే వారిని ప్రోత్సహించి తగు సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలి

రేణిగుంట : విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి పుస్తకాలకు దగ్గరగా ఉండాలని అర్బన్ సీఐ జయచంద్ర కోరారు. రేణిగుంట పాత చెక్‌పోస్ట్‌లోని ఇన్ఫాంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం అర్బన్ సీఐ జయచంద్ర విద్యార్థులకు మహిళల భద్రత, సైబర్ నేరాలు, తదితర విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. మత్తు పానీయాలకు ,ఆన్లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ స్వాతి, ప్రిన్సిపల్ సైమన్, ఏఎస్ఐ పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యప్రభపై నీలకంఠేశ్వరుని వైభవం



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వర స్వామి మంగళవారం సూర్యప్రభ వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగారు. ముందుగా స్వామి అమ్మవార్లకు పలు రకాల పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి అమ్మవార్లు సూర్యప్రభ వాహనంపై కొలువుదీరి గ్రామవీధుల్లో ఊరేగారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి మొక్కులు చెల్లించుకున్నారు.

గంగ జాతర చాటింపు



విశేష అలంకరణలో గంగమ్మ తల్లి

రేణిగుంట : గ్రామ దేవత గంగమ్మ తల్లి జాతర మహోత్సవాలకు మంగళవారం రాత్రి వైభవంగా చాటింపు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సోలా మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి విశేష పూజలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. రాత్రి జాతరకు చిహ్నంగా చాటింపు వేసేందుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఖడ్గాన్ని, త్రిశూలాన్ని పట్టుకుని డప్పు కొడుతూ ఊరేగారు. పొలిమేర దేవతలకు పూజలు చేసి గంగ జాతర మహోత్సవాల్లో ఎలాంటి ఆటంకాలు రాకుండా ఎల్ల దేవతలు ఆశీర్వదించాలని కోరారు. డప్పు కొడుతూ జాతర చాటింపు వేసి పొలిమేర దేవతలను ఆహ్వానించారు. కార్యక్రమంలో సదాశివరెడ్డి, జ్యోతి నారాయణ,లక్ష్మణ్ రెడ్డి, ఉమేష్,వి ఆర్ రావణ,రేణు,చినబాబు, సురేష్, భాస్కర్ పాల్గొన్నారు.

అశ్వవాహనంపై వీరభద్రుడు



అశ్వవాహన సేవలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

నారాయణవనం: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఉత్సవర్లకు అశ్వవాహనాన్ని అధిరోహించి ఆ స్థానంలో పాల్గొన్నారు. ఉదయం భద్రకాళీ, వీరభద్రులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తి అశ్వవాహనంపై అధిష్ఠింపజేశారు. ఉత్సవ ఊరేగింపు కొనసాగే వీధిలో రాత్రి 8 గంటలకు వృద్ధుడు మృతి చెందడంతో ఊరేగింపు రద్దు చేశారు. ఉత్సవమూర్తులకు ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు పర్యవేక్షించారు. బుధవారం ఉదయం వీరభద్ర స్నానం, ధ్వజారోహణంతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని వారు తెలిపారు.

అకాల వర్షాలతో నేలవాలిన పంట



అమ్మపాళెంలో నేలకొరిగిన వరిపంట

శ్రీకాళహస్తి : ఆరుగాలం కష్ట పడి పండించిన వరిపంట చేతి కొచ్చే సమయంలో ఒక్కసారిగా సోమవారం వర్షం కురవడంతో వరిపంట పూర్తిగా నేలకూలింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని అమ్మపాలెం , తొండమనాడు, పుల్లారెడ్డి కండ్రిగ, గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో వరి పంట సాగు చేశారు. కొద్ది రోజులైతే పంట చేతికి వస్తుంది. అలాంటి తరుణంలో అకస్మాత్తుగా సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో వెన్నుదశలో ఉన్న వరి పంట దాదాపు 300 ఎకరాల్లో నేల వాలినట్లు రైతులు చెబుతున్నారు. రవీంద్రారెడ్డి, గున్నేరు మధుసూదన్ రెడ్డి, చిన్నకొండ చెంచు రెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బరామిరెడ్డితో పాటు పలువురు రైతులు సాగు చేసిన వరి పంట దెబ్బతిందని చెప్పారు.

రాయితీపై వరి విత్తనాలివ్వండి

- మండల సమావేశంలో సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వరి ఎక్కువగా సాగు చేస్తారని, ప్రభుత్వం రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై సభ్యులు ధ్వజమెత్తారు. గ్రామ సచివాలయాల సిబ్బంది పనితీరు బాగోలేదని, సమయపాలన పాటించడం లేదని, వారిని అధికారులు గాడిన పెట్టాలన్నారు. గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యల్లో ఏ ఒక్కటీ ఇప్పటివరకు పరిష్కరించలేదని, ఇలాంటప్పుడు సమావేశం ఎందుకని అధికారులను నిలదీశారు. ముఖ్య అతిథిగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ, సమావేశంలో ప్రజా ప్రతినిధులు ప్రస్తావించే సమస్యలను అధికారులు పరిష్కరించాలని, పార్టీలకు, కులాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలని ఆదేశించారు. సర్పంచులు గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. ఉపాధి హామీ కింద సత్యవేడు నియోజకవర్గంలో రూ. 20 కోట్లతో సిమెంట్ రోడ్లు వేశామని, త్వరలో మరో రూ. 20 కోట్లతో సీసీ రోడ్లు మంజూరు అవుతాయన్నారు. వ్యవసాయశాఖ అధికారి షణ్ముగం మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ పొందని రైతులు తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తెలిపారు. కాటూరు గ్రామ దళితవాడకు శ్మశానం లేక పోవడంతో చెరువు కట్టపై మృతదేహాలను ఖననం చేస్తున్నామని, శ్మశానానికి స్థలం కేటాయించాలని పలు సమావేశాల్లో సమస్యను ప్రస్తావించినా పట్టించుకున్న పాపానపోవడం లేదని ఎంపీటీసీ రవి విమర్శించారు. మండలంలో 943 పక్కాగృహాలు నిర్మాణంలో ఉండగా 609 ఇళ్లు పూర్తియ్యాయని, మిగిలిన ఇళ్లు నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేస్తామని హౌసింగ్ అధికారి దయాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 3,200 ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, విద్యుత్ సమస్యలుంటే తన దృష్టికి తేవాలని ట్రాన్స్‌కో ఏఈ చలపతి కోరారు. పీఆర్ ఏఈ నాగరాజు మాట్లాడుతూ, 57 సిమెంట్ రోడ్డు పనులకు గాను 55 పనులు పూర్తి చేశామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్య మాట్లాడుతూ, మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, తహసీల్దార్ శ్రీదేవి, ఎస్ఐ విశ్వనాథనాయుడు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

రేణిగుంట : స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో 11వ తేదీ ఎస్పీడీసీఎల్ కార్యాలయాల ముందు నిర్వహించే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి నేతలు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడారని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టమని చెప్పింది నారా లోకేష్ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా ఈనెల 11వ తేదీ విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ నారాయణతో పాటు అన్ని పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమం అనంతరం రెండోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన మురళిని సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయలక్ష్మి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో కూటమి విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

శ్రీకాళహస్తి : ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు విమర్శించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సూపర్‌సిక్స్ హామీల అమల్లో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలల విలీన ప్రక్రియపై తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా విముక్తి లేదన్నారు. ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా ఈనెల 11వ తేదీన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు వామపక్షాలు పిలుపునిచ్చాయని వివరించారు. తిరుపతి శెట్టిపల్లి భూ సమస్యను కేబినెట్లో చర్చించి తుడాకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య పాల్గొన్నారు.

రెండోసారి ఏకగ్రీవంగా గురవయ్య

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి రెండోసారి జిల్లాకార్యవర్గ సభ్యుడుగా జనమాల గురవయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథ రెడ్డి తెలిపారు.

ఇన్‌లైన్ ఫ్లోరినేషన్‌తో స్వచ్ఛమైన నీటి సరఫరా



యానాదివెట్టు పంచాయతీలో ఇన్‌లైన్ ఫ్లోరినేషన్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ మధుసూదన్

వరదయ్యపాళెం: గ్రామ పంచాయతీల్లో ఇన్‌లైన్ ఫ్లోరినేషన్ ద్వారా స్వచ్ఛమైన నీటి సరఫరా జరుగుతుందని, తద్వారా పంచాయతీ ప్రజలు ఆరోగ్యానికి భద్రత కలుగుతుందని, అందుకు ప్రతి సర్పంచ్ చొరవ తీసుకుని ఇన్‌లైన్ ఫ్లోరినేషన్ చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ మధుసూదన్ పిలుపునిచ్చారు. ఆ మేరకు మంగళవారం యానాదివెట్టు పంచాయతీలో జరిగిన ఇన్‌లైన్ ఫ్లోరినేషన్ పనులను స్థానిక పంచాయతీ కార్యదర్శి గురవయ్యతో కలసి పరిశీలన చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఇన్‌లైన్ ఫ్లోరినేషన్ చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా బాధ్యతగా చేపట్టాలని కోరారు. ఇన్‌లైన్ ఫ్లోరినేషన్ ద్వారా ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే నీరు గానీ, నేరుగా బోరు నుంచి సరఫరా అయ్యే నీరు గానీ శుద్ధజలాలుగా పంచాయతీ ప్రజలకు నీటి సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో సత్ఫలితాలు ఇస్తుందని తెలిపారు. శుద్ధజలాల వినియోగం వల్ల గ్రామాల్లో అనారోగ్య సమస్యలు దూరమవుతాయని వివరించారు. తప్పనిసరిగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు ఇన్‌లైన్ ఫ్లోరినేషన్ చేపట్టేందుకు సహకరించాలని కోరారు.

ప్రార్థనా వేదిక నిర్మాణానికి చేయూత



శివశంకర్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యాయులు

ఏర్పేడు : మండలంలోని పల్లం హైస్కూల్‌లో 2001–02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన చింతలపాలెం గ్రామానికి చెందిన బాపన శివశంకర్ తన ఉన్నతికి కారణమైన పాఠశాల అభివృద్ధికి తన వంతుగా చేదోడుగా నిలవాలన్న ఆకాంక్షతో ముందుకొచ్చి పాఠశాలలో నూతన ప్రార్థనా వేదిక నిర్మాణానికి ముందుకొచ్చాడు. హెచ్‌ఎం తీగల ఆనంద్‌ను కలసి ఇప్పటికే రూ.4 లక్షలు విలువైన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను పాఠశాలకు అందించారు. అలాగే మంగళవారం పాఠశాలకు వచ్చి తన తండ్రి ఈశ్వరయ్య జ్ఞాపకార్థం పాఠశాలలో రూ.3 లక్షలతో నూతనంగా ప్రార్థనా వేదికను నిర్మించడానికి ముందుకొచ్చారు. దీంతో పూర్వ విద్యార్థి బాపన శివకుమార్‌ను పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయులు తీగల ఆనంద్, ఉపాధ్యాయులు సత్కరించారు.